

# ఆ బ్రహ్మము మీరే



ఉన్నది ఆత్మ ఒక్కటే! మనము అదయ్యే ఉన్నాము. ఆత్మ అనంతము, అఖండము, అమరము, అజరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము. సత్‌చిత్ ఆనంద స్వరూపము. దానిని నీరు తడుపలేదు-నిప్పు కాల్చలేదు-గాలి కదుపలేదు. దానికి ఆదీలేదు-అంతమూలేదు; పుట్టుకాలేదు-మరణమూలేదు. అదికాలాతీతము-గుణాతీతము-ఊహాతీతము. అట్టిఆత్మ మనహృదయములో ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది-అది మన స్వరూపమైఉంది.

కాని మనస్వరూపాన్ని మనము మరచిపోయాము-పుట్టి పెరిగి గిట్టే ఈదేహమే మనమనుకుంటున్నాము. దేహము పుడితే-పుట్టామనుకుంటున్నాము. దేహానికి రోగంవస్తే-నాకు రోగంవచ్చిందనుకుంటున్నాము. దేహము చనిపోతుంటే-నేను చనిపోతున్నా ననుకుంటున్నాము. దేహానికి సుఖంవస్తే-సుఖం వచ్చిందనుకుంటున్నాము, కష్టం వస్తే-కష్టం వచ్చిందనుకుంటున్నాము-ఇలా దేహముతోటి మనము తాదాత్మ్యము పొందుతున్నామే గాని-మన స్వరూపమైన ఆత్మతో తాదాత్మ్యం పొందుటలేదు. “నేను” అను తలంపే ఈ దేహబుద్ధికి ఆధారము..

చైతన్యమైన ఆత్మను-జడమైన దేహమును కలిపి ముడిపెడుతూ, రెండింటికీ మధ్యన దేహపరిమితమైన “నేను” ఒకటి పుట్టుచున్నది-అదే చిజ్జడ గ్రంథి-అదే అహంకారము-అదే అజ్ఞానము-అదే జీవుడు-అదే కారణశరీరము.

ఈ “నేను” నిజముకాదు-అది కేవలము ఒక తలంపు మాత్రమే! మనకు వచ్చు తలంపులలో-ఈ “నేను” అనునది ప్రథమ తలంపు. ఈ “నేను” అను తలంపును ఆధారముగా చేసుకొనే మనకు మిగిలిన అన్నితలంపులు వచ్చుచున్నవి. ఆతలంపులమూటే-మనస్సు!

ఈ “నేను” అను తలంపు మనకు ఎక్కడో బయటనుంచి వచ్చుట లేదు-మనలోపలనుంచే వస్తున్నది. అందుకే ప్రతీమనిషి “నేను, నేను” అని తనగుండెలమీద కుడివైపున క్రిందిభాగములో చేయివేసి చూపిస్తుంటాడు. అంటే ఆ నేనుకు మూలము అక్కడనే ఉంది-అదే ఆధ్యాత్మిక హృదయము.

ఆహృదయములో బ్రహ్మము నిరంతరము “నేను,నేను” అని స్వయముగా ప్రకాశిస్తున్నది. అదే నిత్యమైన సత్యమైన ఆత్మ గతమైన “అసలు నేను”. నీటిలోనుంచి బుడగ వచ్చినట్లు-ఆత్మ గతమైన ఈ

"అసలు నేను" లోనుంచే దేహపరిమితమైన ఈ "మిధ్యానేను" పుట్టుచున్నది. కాని ఈ "మిధ్యా నేను" తన మూలమును మరచిపోయి-తాను స్వయంభవుణ్ణి అనుకొని స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది.

"నిజమైన నేను" మన అనుభవములో లేదు. "మిధ్యానేనే" మన అనుభవములో ఉంది. ఈ మిధ్యానేనే మనమని అనుకుంటున్నాము-అది కల్పించిన దేహముచుట్టూ, మనస్సుచుట్టూ తిరుగుతున్నాము. మన కళ్ళకు కనిపించే ఈలోకమంతా మనస్సు సృష్టే! మనస్సులో లేనిదేదీ మనకు కనిపించదు. అందుకే మనస్సును మింగినవాడు యోగి-లొంగినవాడు భోగి అవుతాడు.

మనమందరము కోరుకునేది దేవుణ్ణి-అలంకరించేది అహంకారాన్ని! మనము కోరిన కోరికలు తీర్చటానికే మనకు దేవుడు కావాలి గాని-దేవుణ్ణి దేవునికోసమే మనము ప్రేమించుటలేదు. ఎంతసేపు ఈలోకములోని సుఖాలను జుర్రుకోవాలనే ఆశపడుతుంది మనస్సు! ఈబాహ్యసుఖాలు అనుభవించేటప్పుడు తీయగా అనిపిస్తాయి-కాని పరిణామములో దు:ఖాన్ని తీసుకువస్తాయి. ఈజన్మలో మనము ఏవైతే కష్టాలనుకుంటున్నామో, నష్టాలనుకుంటున్నామో, దు:ఖాలనుకుంటున్నామో గతజన్మలలో వాటికోసం మనము పరుగులెత్తాము. నాటియిష్టాలు నేడు కష్టాలను తీసుకువస్తుంటే-వాటిని తప్పించుకొని, కొత్తసుఖాలను పొందాలని తపనపడుతున్నాము. నేటి సుఖాలే-రేపటి దు:ఖానికి పునాదులని మనము ఎప్పుడు తెలుసుకుంటాము?

మనమందరము మనస్సు కల్పించినదే నిజమనుకొని ఎవడికి వాడు తన మనస్సుఅనే చుట్టుగుడిశలోనే కాపురముంటున్నాడు. ఈగుడిశకు "నేను" అను అహంకారమే ఆధారము. ఈ "నేను" అను ఒంటిస్థంభము మీదనే మనస్సు అనే గుడిశ నిలబడివుంది. ఆనిట్రాడ కూలిపోతే-గుడిశ కూలిపోతుంది. మనము నిజంగా సుఖపడాలని అనుకుంటే-ముందు ఆ "నేను"ను కూల్చాలి-అప్పుడు మనస్సు దానంతట అదే కూలిపోతుంది.

అహంకారము ఉన్నంతకాలము మనిషి ఆశను వీడలేదు. ఆశ వీడినంతకాలము జన్మలు తప్పవు. జన్మవచ్చినదంటే దు:ఖము వచ్చితీరుతుంది. మనిషి ఫలితాన్ని ఆసించి పనిచేసినంతకాము-ఫలితం వస్తుంది-ఆఫలితాన్ని వాడనుభవిస్తాడు-ఆఅనుభవములోనుంచి సంస్కారము పుడుతుంది-ఆసంస్కారము హృదయములో బీజరూపమున దాగివుండి, మరుజన్మలో మరల అదేపనిని చేయిస్తుంది. ఇలా ఏజన్మకాజన్మ ఆవాసన మరింత బలపడుతుంది-వాడు కర్మసముద్రంలో కూరుకు పోతాడు-జనన మరణ చక్రములోనుంచి బయటపడలేడు.

అహంకారములోనుంచి విడుదల పొందుటే-మోక్షం! మోక్షమే మన సహజస్థితి. మోక్షము పొందాలని మనము కోరుకుంటున్నప్పుడు కూడా-మనము మోక్షములోనే ఉన్నాము. కాని "నేను" అనే పిశాచము, అహంకారమనే పిశాచము మనల్ని ఆవరించి-మోక్షసుఖాన్ని మనఅనుభవములోనికి

రాకుండా అడ్డుపడుతున్నది.

గాఢనిద్రలో మనము ఆమోక్షసుఖంలో, ఆత్మసుఖంలో మునిగి తేలుతున్నాము. అందుకే ప్రతీమనిషి నిద్రలేవగానే "నాకు హాయిగా, సుఖముగా నిద్రపట్టినది" అని చెపుతూ ఉంటాడు. అంతే! మరల నిద్రలోనుంచి మెలుకువరాగేనే – "నేను" అనే పిశాచము మనల్ని ఆవరిస్తుంది. ఆ "నేను" రాగానే – మన ఆశలు, ఆశయాలు, రాగాలు, ద్వేషాలు, కోపాలు, తాపాలు అన్నీ ఒకదాని తరువాత ఒకటి సైన్యం వచ్చినట్లు మనబుర్రలో విజృంభిస్తున్నాయి – మనల్ని అశాంతికి గురిచేస్తున్నాయి.

గాఢనిద్రలో మనకు ఈ గొడవలేమి గుర్తుకు రావటంలేదు – ఎందుచేత? ఈ గొడవలన్నింటికీ మూలము "నేను". ఈ "నేను" వుంటే అంతావుంది– "నేను" లేకపోతే ఏమీలేదు – ఉన్నది ఆత్మే! గాఢనిద్రలో ఈ "నేను" దాని మూలములో అణిగిపోతుంది. "నేను" లేప్పుడు – మనమస్సు కూడా అణిగిపోతుంది.

గాఢనిద్రలో మన ప్రయత్నముతో నిమిత్తము లేకుండానే ఈ "నేను" దాని మూలములో అణిగిపోతుంది. జాగ్రదవస్తలో మనము ప్రయత్నముచేసి ఈ "నేను" ను దానిమూలములోనికి పంపించగలిగితే – మోక్షసుఖం మన సొంతమౌతంది.

ఈ "నేను"ను దాని మూలములోనికి పంపించటానికి భగవాన్ శ్రీరమణ మహర్షి "నేను ఎవడను?" అను విచారణపద్ధతిని బోధించారు. విజృంభిస్తున్న 'మనస్సు" అనే మదపుటేనుగునకు "నేనెవడను?" అను ప్రశ్న అంకుశము వంటిది.

మనల్ని ప్రకృతి ప్రలోభాలకు బలిచేస్తున్న ఈ "నేను" –"పూజలు చేస్తే – చేసుకో, కొబ్బరికాయలు కొడితే – కొట్టుకో., దండలు తిప్పితే – తిప్పుకో, యాజ్ఞాలు యాగాలు చేస్తే – చేసుకో – కాని నాజోలికి మాత్రం రాకు" అంటుంది. ఎందుకని? – అసలుదొంగ ఈ "నేనే"! ఈ "నేను" ను బోనులో నిలబెట్టి 'నీవెవడవు?" అని నిలదీస్తే – అప్పటికవరకు బాహ్యసుఖాలకోసం పరుగులు తీస్తున్న మన నేను ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరై తల్లక్రిందులౌతుంది. అప్పుడు తన మూలాన్ని శోధించటం మొదలుపెడుతుంది. హృదయములోనికి ప్రయాణం చేస్తుంది. హృదయములో ఏముంది? ఆత్మఉంది. అప్పటివరకు బాహ్యసుఖాలను మరిగిన మన మనస్సు – ఆత్మసుఖాన్ని ఒక్కసారి ఎప్పుడైతే రుచిచూసిందో – తేనెలో పడ్డ ఈగలాగ ఇక బయటికి రమ్మంటేరాదు. "నేను"ను మనము హృదయస్థానమందు నిలకడగా నిలిపి ఉంచగలిగితే మన మనస్సులో నున్న కోరికలు విజృంభించుటకు ఆధారములేక అవకాశము చిక్కక పలుచబడి రాలిపోతాయి. అప్పుడు మనస్సు ఆత్మాకారము చెందుతుంది – ఆత్మ తానుగా వ్యక్తమౌతుంది.

"తాను దేహమని" జీవుడు ఎంతసహజంగా అనుకుంటున్నాడో "తాను ఆత్మనని" అంత

సహజంగా ఏజన్మలో తెలుసుకుంటాడో అదే వాడికి కడసారిజన్మ!

ఈశ్వరుడు సర్వస్వతంత్రుడు - కాని జీవుడు అస్వతంత్రుడు. అహంకారమే కేంద్రముగా మనము కర్మను ఆచరించినంతకాలము మనకు వచ్చే ప్రతీతలంపునకు, మనము చేసే ప్రతీపనికి ఏదోఒక జన్మలో మనము సమాధానము చెప్పితీరాలి. అప్పటివరకు అహంకారమనే కర్రాడకు, మనస్సు అనే తాడుతోకట్టి, ప్రారబ్ధమనే కర్రతో దేవుడు మనల్ని మోదుతూనే ఉంటాడు. ఇందులో దేవుడికి పక్షపాతం లేదు. మన కర్మలకు మనమే బాధ్యులం. ఈకర్మచక్రంలో నుంచి జీవుడు బయటపడాలంటే స్వప్రయత్నము, కాలపరిపక్వము, ఈశ్వరకటాక్షము కలిసిరావాలి. ఈశ్వరకటాక్షము లేకుండా కేవలము మనము చేసే సాధనాలతోటే ఏజీవుడూ అహంకారమనే ఈ జైలులోనుంచి బయటపడలేదు. అహంకారంతో మనము వేసే కుప్పిగంతులకు అనంతమైన ఆత్మ అందదు. అయితే మరి సాధనల ప్రయోజనం ఏమిటి? మనము ఏదైతే పొందటానికి తపన పడుతున్నామో - దానిని పొందకుండా మనకు మనమే అడ్డుగా వున్నామని తెలుసుకోవటానికే సాధనలు!

మనము భగవంతుడిని తెలుసుకోవాలని అనుకుంటే - మనకు ఆయన తెలియబడడు. మనము చేసే సాధనలే గనుక నిజమైతే - ఆయనే మనకు తెలియబడాలి అని అనుకుంటాడు. ఈ మాంసపు నేత్రాలతో మనము ఆదేవుణ్ణి చూడలేము.

ఆదేవుని కోసం మనము పడేతపనలో నిజాయితీ ఉంటే - ఆ దేవుడే దేహము ధరించి సద్గురురూపంలో ఈభూమి మీద అవతరిస్తాడు - మనల్ని తరింపచేయటానికి.

మీకుఅసాధ్యం ఉండవచ్చు - నాకు అసాధ్యం ఉండవచ్చు కాని గురువుకు అసాధ్యం లేదు. గురువు అనుగ్రహముతోటి సమానమైది మరొకటి లేదు. శరీరంలో గెడ్డంపెంచుకున్నవాడో, కాషాయం కట్టినవాడో, పట్టుపీతాంబరాలు ధరించినవాడో గురువుకాదు - ఆత్మను దర్శించినవాడే గురువు శబ్దానికి అర్హుడు! పులినోటిలో పడిన మాంసపు కండైనా జారిపోతుందేమోగాని - గురువు అనుగ్రహములో పడిన వాడు రక్షింపబడే తీరతాడు. కాని మన అహంకారాన్ని ఆయనకు అర్పించటానికి మనము సిద్ధముగా ఉన్నమా? ఎవరి హృదయాన్ని వారు తడిమి చూసుకోండి! మీకు మీరే అడ్డుగా వున్నారు. మిమ్మల్ని మీరు మింగలేరు-కాని మీ "నేను"ను మింగేశక్తి మీ గురువుకు ఉంది. మీ "నేను" పోతే - ఆవస్తువు మీరే! అబ్రహ్మము మీరే!

డా॥ కె.రామారావు, జిన్నూరు

శ్రీరామ్ గ్రాఫిక్స్, పాలకొల్లు, ☎ 222438